క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వరంగల్‌లోని జాన్‌పీర్లు 11 కేవీ ఫీడర్‌లో జాన్‌పీర్ల, స్తంభంపల్లి, గొర్రెకుంట ఇండస్ట్రీ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు, ఏనుమాముల మార్కెట్‌లోని 11 కేవీ ఫీడర్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వరంగల్ డీఈ మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, హనుమకొండ బాలసముద్రంలోని లైబ్రరీలోని ఫీడర్‌లో ఉదయం 8.30నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ సాంబరెడ్డి పేర్కొన్నారు.

నేడు సాయిబాబా సంస్మరణ సభ

నయీంనగర్: ప్రజాస్వామిక వాదులు, వామపక్ష వాదులు, లౌకికవాదుల ప్రజా సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా సంస్మరణ సభను హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్నట్లు కన్వీనర్ గంటా రామారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగల్‌రెడ్డి తెలిపారు.

నూతన ఓటర్ల నమోదు



న్యూశాయంపేట: వరంగల్ ఉర్సు ఫత్తర్ మసీదు వద్ద ఉన్న ఉర్సు ఉర్దూ మీడియం ప్రభుత్వ హైస్కూల్‌లో నూతన ఓటర్ల నమోదు, ఓటర్ జాబితా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని శనివారం 170 నుంచి 173 పోలింగ్ స్టేషన్లలో ఉన్న ఓటర్ల వెరిఫికేషన్, అర్హులైన నూతన ఓటర్ల పేర్లను బీఎల్ఓలు ఉష, కల్యాణి నమోదు చేశారు. కార్యక్రమంలో టీఎస్ – మేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోఫిఖుర్ – రహమాన్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కాజీపేట రూరల్: సత్యసాయి బాబా జయంతి సందర్భంగా కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో, రైల్వే కాలనీలో పేదలకు శనివారం దుప్పట్లు, ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ పి.సూర్యారావు, శ్రీసత్యసాయి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



హసన్‌పర్తి: సన్నధాన్యానికి రూ.500 బోనస్ రైతుల ఖాతాలో జమ కావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ పోలం అనిల్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాము, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ యాత్ర



కాశిబుగ్గ: పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పిలుపునిచ్చారు. ఈమేరకు పైడిపల్లి, మర్రి వెంకటయ్యకాలనీ, శాంతినగర్‌లో ప్రజాపాలన విజయోత్సవ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వరంగల్: పశువులను వధించి మాంసం విక్రయిస్తున్న వరంగల్ నిజాంపుర మండిబజార్‌కు చెందిన ఎండీ.జహీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైల్వే ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో కాజీపేట సబ్ డివిజనల్ టీఆర్‌డీ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్ మ్యాచ్ శనివారం జరిగింది. జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ హరిబాబు, జేఈ టీఆర్‌డీ సాయికృష్ణ, టీఆర్‌డీ ఎస్ఎస్ఈ రాజ్‌కుమార్, ఎస్ఎస్ఈ మహేందర్, జేఈ వెంకట్, టీఆర్‌డీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్‌యూపీపీటీ సభ

విద్యారణ్యపురి: జిల్లాలో ఇటీవల పదోన్నతులు పొందిన భాషా పండితులు (తెలుగు, హిందీ, ఉర్దూ), అలాగే, పీజీహెచ్ఎంలుగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్ సన్మాన కార్యక్రమాన్ని ఈనెల 24న హనుమకొండ జిల్లా పరిషత్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ భాషా పండిత్ పరిషత్ ఆర్‌యూపీపీటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సాల్లేటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎండీ.ఫరూక్ సాదిత్‌అలీ తెలిపారు.

చీకట్లో ప్రయాణం



వీధి దీపాలు లేని బైపాస్‌రోడ్డు



కాజీపేట మండలంలోని కడిపికొండ గ్రామం మీదుగా ఖమ్మం వెళ్లే బైపాస్ రోడ్డులో హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు లేవు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతోంది. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– కాజీపేట అర్బన్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీదేవి

మడికొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి అన్నారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు వంటి వాటినుంచి రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ పని చేస్తోందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు ఆపద సమయంలో 181, 0870 2452112, 73829 83088 నంబర్లకు కాల్‌చేసి తక్షణ రక్షణ పొందాలని శ్రీదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో కేసు వర్కర్ వినీల, టైలరింగ్ టీచర్ రమ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: ఆల్ ది బెస్ట్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక కార్యకర్తలను సేవా నంది, సేవాభూషణ్ జాతీయ పురస్కారాలతో సత్కరించేందుకు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవా కార్యకర్తలు వివిధ విభాగాల్లో అందించిన సేవలకు పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. చేసిన సేవలకు సంబంధించిన వార్త పత్రికల క్లిప్పింగ్‌లు, ఫొటోలతో కూడిన దరఖాస్తులను పరిశీలించి డిసెంబర్ 8న హైదబాద్‌లోని సంస్థ కార్యాలయంలో పురస్కారాలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ఖిలా వరంగల్: ర్యాలీ నిర్వహిస్తున్న కేడెట్లు



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

ఖిలా వరంగల్: నీళ్ల, పచ్చదనం పరిశుభ్రతను కాపాడుకుందామని కోరుతూ వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని జ్యోతిబాపూలే గురుకుల బాలిక పాఠశాల, కళాశాల ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ అధికారులు సత్యనారాయణ, నరేంద్ర, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో ఎన్‌సీసీ డే వేడుకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని బాలికల గురుకుల కళాశాలలో శనివారం ఎన్‌సీసీ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని వ్యర్థాల నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందుమతి, కమాండెంట్ రవిచంద్ర కుమార్, ఏఓ మేజర్ రేవతి ప్రభాకరన్, పీడీ నాసర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గెలుపుతో సంబురాలు

హన్మకొండ చౌరస్తా: కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంకగాంధీ గెలుపొందడంపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నగర మహిళా నాయకురాలు సరళ ఆధ్వర్యంలో హనుమకొండ డీసీసీ భవన్ ఎదుట సంబురాలు జరుపుకున్నారు.

రైతు కార్మిక సంఘాల ర్యాలీని జయప్రదం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26వ తేదీన వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు జరగనున్న రైతు కార్మిక సంఘాల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు కార్మిక సంఘాల నాయకులు గంగుల దయాకర్, వీరగోని శంకరయ్య, గోనె కుమారస్వామి, సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ కూరగాయల మార్కెట్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్, సుదమల్ల భాస్కర్, ఎంఏ.పాషా, ఓదెల రాజయ్య పాల్గొన్నారు.

మహారాష్ట్రలో బీజేపీ విజయంపై హర్షం

వరంగల్: ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశ క్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతోనే మహారాష్ట్రలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఈమేరకు వరంగల్ చౌరస్తాలో నాయకులు శనివారం టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, హరిశంకర్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని బీజేపీ జిల్లా నేత కర్నె రవీందర్ ధీమా వ్యక్తంచేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు, ఉపాధ్యక్షుడు రాధారపు మహేష్, మద్దూరి శివ, బండ కృష్ణ, బూతం రాహుల్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి స్పష్టమైన మెజార్టీ సాధించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి సెంటర్‌లో శనివారం సంబురాలు జరుపుకున్నారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, రాంచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మడికొండ: మడికొండ చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకుని, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొనగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బీజేవైఎం నాయకులు తక్కళ్లపెల్లి నిఖిల్‌రావు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బరిగల పినోకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కులస్తులు ఐక్యత చాటాలి

- పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్

ఖిలా వరంగల్: కార్తీకమాస వనభోజన మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరై పద్మశాలీలు తమ ఐక్యతను చాటాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పోపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో ఆటపాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాశిబుగ్గ: అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న పద్మశాలి వనభోజనాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు ఆడెపు రవీందర్, నాయకుడు కుసుమ సతీష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి గోరంటల రాజు, బేతి అశోక్, బైరి శ్యాంసుందర్, చిప్ప వెంకటేశ్వర్లు, ములక సురేష్, మార్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

సంతాన లింగేశ్వరుడికి పూజలు

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురికాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సంతాన లింగేశ్వరస్వామికి శనివారం దీపాలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తులసీ పూజ, ఈశ్వరాభిషేకం, సహస్ర బిల్వదళ పూజలు జరిపించారు. దేవాలయ వ్యవస్థాపకుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో భక్తులు సంతాన లింగేశ్వరుడి చుట్టూ దీపాలను వెలిగించి దీపారాధన పూజ చేశారు. కార్తీకమాస విశిష్టతపై ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ.. భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం దేవాలయంలోని అన్నపూర్ణ కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్తంగా

మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: మాల జాతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ కాకతీయ యూనివర్సిటీ బాధ్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు కేయూ గేట్‌వద్ద సింహగర్జన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

డీఆర్‌డీఏ పీడీకి సన్మానం

కాజీపేట: హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీగా బాధ్యతలు చేపట్టిన మేన శ్రీనును ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు మేన శ్రీనును సన్మానించారు.

బొడ్రాయి పూజలు వైభవంగా నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: పడమరకోట జంక్షన్‌లో ఆదివారం నుంచి మంగళవారం వరకు గ్రామ దేవత శ్రీభూలక్ష్మి, మహాలక్ష్మి సమేత నాభిశిల (బొడ్రాయి) పంచమ వార్షిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం తెలిపారు. ఈమేరకు పడమరకోట జంక్షన్‌లో బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో సాగర్ల శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో గజ్జెల శ్యామ్, పుప్పాల రాజేందర్, గొర్రె కోటి, బెల్లంకొండ సుధాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల దేవాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు శివలింగానికి రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. కాలభైరవాష్టమి సందర్భంగా రుద్రేశ్వరస్వామిని కాలభైరవుడిగా అలంకరించారు.

మిల్లెట్స్ డే

నయీంనగర్: అనాదిగా తమ పూర్వీకులు ఉపయోగించిన చిరుధాన్యాల చిరుతిళ్లను విద్యార్థులకు అలవాటు చేయాలని స్కూల్ కరస్పాండెంట్ మండ శ్రీనివాస్ సూచించారు. రికార్డ్ సర్వీసెస్ సొసైటీ సహకారంతో స్మైల్ డిజీ స్కూల్‌లో చిరుధాన్యాల చిరుతిళ్లు విద్యార్థులకు అందించి శనివారం మిల్లెట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్, కవిత, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, పావని, త్రివేణి పాల్గొన్నారు.

మొబైల్‌కు దూరంగా ఉండాలి

హసన్‌పర్తి: విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రఘువీర్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సైబర్ క్రైం, బాల్య వివాహాలపై ఎఫ్ఎంఎం సాంఘిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, ఫొటోలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో షేర్ ఎన్జీఓ మండల ఇన్‌చార్జ్ జమున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట అర్బన్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, విద్యాసాగర్, నయీమొద్దీన్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఈనెల 22న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో విలియం కేరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ఇన్‌చార్జ్ విద్యాకర్ తెలిపారు. 300 మీటర్లలో నిహాన‌పటేల్ గోల్డ్‌మెడల్ సాధించగా, 300 మీటర్లలో వైష్ణవి బ్రాంజ్ మెడల్, 600 మీటర్ల అథ్లెటిక్స్‌లో రాహుల్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారని వివరించారు. ఈమేరకు వారిని ప్రిన్సిపాల్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ దేవయ్య, ఫిజికల్ డైరెక్టర్ పోతుల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సునీల్, శ్రీనివాస్ శనివారం అభినందించారు.

ప్రదర్శనలకు అనుమతివ్వండి

హన్మకొండ కల్చరల్: కాళోజీ కళాక్షేత్రంలో ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని వరంగల్ జిల్లా కళాకారులు కోరారు. ఈమేరకు హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజ సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, సభ్యులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన అకుడ్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో నూతనంగా ఆవిర్భవించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ (అకుడ్) బాధ్యులు శనివారం కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీతో కలిసి అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకుడ్ అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, బాధ్యులు నర్సింహరావు, పుల్లా శ్రీనివాస్, ఆశీర్వాదం, శ్రీకాంత్, లింగయ్య, నాగేశ్వర్‌రావు, జూల సత్యం, బబిత, మహేందర్, సుధాకర్, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కుల కోసం పోరాడాలి

న్యూశాయంపేట: మానవ హక్కులు అందరికి సమానమని, సమాన హక్కుల కోసం పోరాడాలని హ్యూమన్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలయ్య సూచించారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో డైరెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ త్వరలో డివిజన్‌లో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా విభాగం నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలిగా రజియా సుల్తానాను నియమిస్తూ నియామక పత్రాన్ని ఉప్పలయ్య అందించారు. నాయకులు ఆడెపు వెంకటేష్, ఆకారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయాలి

న్యూశాయంపేట: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి పిలుపునిచ్చారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, మహేశ్వరి, లీల, శోభ, రాజేశ్వరి, కల్పన, సూర్యకళ, పుతిలీ, యాకూబీ, శ్రీవాణీ, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

కాజీపేట అర్బన్: నర్సంపేట 132 కేవీలో జరిగిన ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ములుగు రోడ్డులోని సబ్‌స్టేషన్ ఎదుట శనివారం ధర్నా చేశారు. గ్రేడ్ -1 ఉద్యోగి జి.కృష్ణను అధికారులు సబ్‌స్టేషన్‌పైకి ఎక్కించి పెయింటింగ్ చేయించడం వల్లనే అతడు ప్రమాదానికి గురై మృత్యువుతో పోరాడుతున్నాడని వాపోయారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

కేయూ క్యాంపస్: స్వేరోస్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గేట్ వద్ద శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, నాయకులు ఓదెల అరిస్టాటిల్, వరుణ్‌తేజ్, వరప్రసాద్, ప్రసన్నకుమార్, రాకేష్, వంశీ, హేమంత్, మధుకర్, నర్సింహ, కరీం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీపై విచారణ



వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని గిర్మాజీపేట పాఠశాలలో గ్యాస్ లీకైన సంఘటనపై వరంగల్ ఎంఈఓ గంప అశోక్‌కుమార్ విచారణ జరిపారు. పాఠశాలను శనివారం సందర్శించి హెచ్ఎం, వంటచేసే వారిని వేర్వేరుగా విచారించినట్లు తెలిసింది. పాఠశాలలో గ్యాస్ లీక్ కావడంపై పత్రికల్లో వచ్చిన కథనంపై డీఈఓ జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఎంఈఓ విచారణ జరిపినట్లు తెలిసింది.

అధికారులు స్పందించాలి

కాశిబుగ్గ: సమస్యల పరిష్కారంలో అధికారులు స్పందించకపోతే తనకు తెలపాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన శనివారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.